క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



అప్పారావును పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్ తదితరులు

ఎచ్చెర్ల: లావేరు మండలం పెద్దరావుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పెద్ది అప్పారావు కాలుకు సర్జరీ అయింది. ఈ విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శుక్రవారం పెద్దరావుపల్లి గ్రామానికి వెళ్లి అప్పారావును పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శలో జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరంగి శ్రీరామ్మూర్తి, పెద్ది చిరంజీవి, పెద్ది సత్తిబాబు, వాకతోట ఆదినారాయణ ఉన్నారు.

వ్యవసాయ క్షేత్రాల పరిశీలన



క్షేత్ర పరిశీలన చేస్తున్న వ్యవసాయాధికారులు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని సానివాడలో ఈ–పంట నమోదుతో పాటు వ్యవసాయ క్షేత్రాల పరిశీలన శుక్రవారం జరిగింది. సమగ్ర యాజమాన్య పద్ధతులు, పంట స్థాయిలను వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు శ్రీధర్ పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త ఉదయ్‌బాబు, ఎంఏవో ఉషాకుమారి, ఏఈవో ఎరుకునాయుడు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో రవి

జి.సిగడాం: మండలంలోని దవలపేట ఎంపీపీ పాఠశాలను ఎంఈఓ అరసాడ రవి శుక్రవారం సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, భోజనం పథకం రికార్డులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు దేశన్న ఉన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నగరంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్, శాంతినికేతన్ జూనియర్ కాలేజీలలో యువ పర్యాటక క్లబ్‌ల విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పర్యాటకశాఖ అధికారి ఎన్.నారాయణరావు నేతృత్వంలో అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలతో విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రాజెక్ట్ నమూనాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెట్‌శ్రీ మేనేజర్ వి.వి.అప్పలనాయుడు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు విజయవంతంచేయండి

శ్రీకాకుళం కల్చరల్: పొన్నాడ బ్రిడ్జి వద్ద శ్రీకృష్ణ మందిరం (ఇస్కాన్) జగన్నాథ మందిరంలో ఈ నెల 25 నుంచి 27 వరకు కృష్ణాష్టమి వేడుకల నిర్వహిస్తున్నాట్లు నిర్వాహకులు లక్ష్మీపతి గౌర్‌దాస్ శుక్రవారం తెలిపారు. 25న భజనలు, నృత్య ప్రదర్శనలు, 26న భారతి రమేష్ బృందం సంగీత విభావరి, ఉట్టి ఉత్సవం, శ్రీకృష్ణార్జు యుద్ధం నాటక ప్రదర్శన, 27న ప్రభుపాదుల వారి జీవిత చరిత్రపై ప్రవచనం, ఉంటుందన్నారు. సమావేశంలో ఇస్కాన్ ప్రతినిధులు అప్పలరాజు, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

- నారాయణ తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 27న కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్యామలరావు, అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు.
- ఈ నెల 26న శ్రీకృష్ణ వేషధారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మిమిక్రీ శ్రీనివాస్ తెలిపారు. వివరాలకు 9441072762 నంబరుకు సంప్రదించాలని కోరారు.

మా భద్రతకూ కావాలి భరోసా..



భద్రత పెంచాలి



మహిళా వైద్యులు, ఉద్యోగులకు భద్రత పెంచాలి. మేము ఒకరిని బతికించడానికి పనిచేస్తాం తప్ప కీడు చేయం. పనిచేసే చోటే భద్రత లేకపోవడం విచారకరం. కలకత్తా తరహా సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. ఆసుపత్రుల్లో రాత్రి వేళల్లో విధులు నిర్వర్తించే సిబ్బందికి ఎటువంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి. కొన్ని సందర్భాల్లో రోగులతో వచ్చే వారితో ఇబ్బందులు వస్తుంటాయి. అటువంటివి జరగకుండా కట్టడి చేయాలి.
– డాక్టర్ డి.పార్వతి, గైనిక్ హెచ్ఓడీ, రిమ్స్

పటిష్ట చర్యలు.



రణస్థలం సామాజిక ఆసుపత్రిలో ఇటీవల ఇద్దరు కుర్రాళ్లు వైద్యం కోసం వచ్చిన నానా రభస చేసి రికార్డులు విసిరేశారు. ఆ సమయంలో ఎదురుగా ఉన్న అగ్నిమాపక ఆధికారులు వచ్చి వాళ్లను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇటువంటి పరిణామాలు చోటుచేసుకోకుండా తగు చర్యలు చేపడతున్నాం. రాత్రి విధుల్లో సెక్యూరిటీతో పాటు జనరల్ డ్యూటీ అసిస్టెంట్ ఇద్దరు మగవాళ్లను నైట్ డ్యూటీగా వేస్తున్నాం.
– డాక్టర్ లలిత సీహెచ్‌సీ, సూపరింటెండెంట్, రణస్థలం

అన్నదాతా సుఖీభవ



అన్నం వడ్డిస్తున్న శ్రీనివాసరావు

- రోజుకు వందమందికి అన్నదానం చేస్తున్న కనుగుల దుర్గా శ్రీనివాసరావు
- నెలకు రూ.3లక్షల వరకు ఖర్చు
- కుమారుడి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని డేఅండ్‌నైట్ ప్రాంతానికి చెందిన కనుగుల దుర్గా శ్రీనివాసరావు అన్నదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ప్రతిరోజూ తానే స్వయంగా వడ్డిస్తూ పేదల ఆకలి తీర్చుతున్నారు. తన కుమారుడు ధీరజ్ జ్ఞాపకార్థం నిత్యం వంద మందికి భోజనం అందిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. తాను సంపాదించిన దానిలో కొంత సేవా కార్యక్రమాలకు వినియోగించాలన్న ఉద్దేశంతో డేఅండ్‌నైట్, అరసవల్లి, కోదండ రామాలయం, కోటీశ్వరాలయం తదితర ఆలయాల వద్ద కూడా బాటసారుల ఆకలి తీర్చుతున్నారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనురాగనిలయం, ఆటిజం కేంద్రాలకు సైతం తన వంతుగా సాయం అందిస్తున్నారు.



క్యూలో నిల్చున్న జనాలు

ఆరేళ్లుగా అన్నదానం ..

శ్రీనివాసరావు ఆడిటర్‌గా సేవలందిస్తూ రెడ్‌క్రాస్‌లో ట్రెజరర్‌గా కొనసాగుతూ పలు సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. తన కుమారుడు ధీరజ్ ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ చేస్తుండగా 2019లో మృతిచెందాడు. దీంతో కనుగుల దుర్గా ధీరజ్ ట్రస్టును ఆరేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నెలకు రూ.3లక్షల వరకు వెచ్చిస్తున్నారు.

నా వంతుగా సేవ..



మా కుమారుడు బతికున్నప్పుడు నా పని నేను చేసుకుంటూ ఉండేవాడిని. ధీరజ్ చనిపోయాక నాలో ఒక్కసారిగా మార్పు వచ్చింది. నా శక్తి మేరకు అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాను.
– కనుగుల దుర్గా శ్రీనివాసరావు, శ్రీకాకుళం

ఎసైన్షియా ఫార్మా యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి

- సీఐటీయూ డిమాండ్

రణస్థలం: అచ్యుతాపురంఎసైన్షియా ఫార్మా కంపెనీలో చోటుచేసుకున్న ఘోర ప్రమాదం నేపథ్యంలో సంబంధిత యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని, పరిశ్రమల్లో కార్మికులకు భద్రత, రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావులు డిమాండ్ చేశారు. కార్మికుల భద్రతకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ పైడిభీమవరంలో శుక్రవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 మంది కార్మికుల నిండు ప్రాణాలు బలికావడానికి మరో 45 మంది తీవ్రంగా గాయాలు పాలవడానికి యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. కార్మికులు డి.ఎల్.నాయుడు, పి.రామక్రిష్ణ, ఆర్.ఎస్.నాయుడు, సత్యనారాయణ, బి.సురేష్ పాల్గొన్నారు.



పైడిభీమవరంలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం కోత అమలు చేయనున్నట్లు ఈఈ భయ్యన్నాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. డి.మత్స్యలేశం, ఓలేటి అగ్రహారం, భగీరథపురం గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటలు వరకు కోత ఉంటుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

వన్‌స్టాప్ సెంటర్లపై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గార: విద్యార్థినులు చదువుతో పాటు స్వీయరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వై.హిమబిందు, బి.కవిత అన్నారు. శుక్రవారం శాలిహుండం కేజీబీవీలో వన్‌స్టాప్ సెంటర్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపద సమయంలో మహిళలకు ఈ కేంద్రాలు ఆపన్నహస్తం అందిస్తాయన్నారు. సురక్షిత స్పర్శ, సైబర్ నేరాలు, బాల్యవివాహాలు, వరకట్న వేధింపులు, గృహహింస, మానవ అక్రమ రవాణా, అత్యాచారాలు వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎప్పుడైనా ఆపద కలిగితే 100, 1098, 181, 112 హెల్ప్‌లైన్ నంబర్లుకు సమాచారం అందించాలని సూచించారు.

విద్యార్థులు పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న రమణమూర్తి నాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎచ్చెర్లలోని వెంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎస్‌సీవీ రమణమూర్తి నాయుడు అన్నారు. కళాశాలలో శుక్రవారం జాతీయ అంతరిక్ష పరిశోధన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత దేశం అంతరిక్ష పరిశోధనల్లో ప్రపంచంలో అగ్రదేశాలతో పోటీ పడుతోందని చెప్పారు. చంద్రయాన్–3, చంద్రయాన్–2 వంటి ఇస్రో పరిశోధనలు ప్రపంచ దేశాలకు సత్తా చూపించాయని అన్నారు. విద్యార్థులు సాంకేతిక ప్రగతిపై పట్టు సాధించాలని, పరిశోధన విద్య, నూతన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ వీకే చక్రవర్తి, ఈసీఈ హెచ్ఓడీ తిరుమలరావు పాల్గొన్నారు.

విద్యార్థినులు స్వీయరక్షణపై దృష్టిపెట్టాలి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థినులు స్వీయ రక్షణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని శ్రీకాకుళం మహిళా పోలీస్ స్టేషన్ ఎస్సై బి.రేవతి అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మహిళల భద్రతపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. కళాశాలల్లో చదువుతున్న, ఉద్యోగం చేస్తున్న మహిళలు ఆమ్మస్థైర్యం, మనో ధైర్యంతో ఉండాలని చెప్పారు. దేశంలో జరగుతున్న మహిళలపై దాడులు, రేప్‌లు, నమోదవుతున్న పోక్సో కేసులు ఆందోళన కల్గిస్తున్నాయని అన్నారు. తల్లిదండ్రులు ఆడపిల్లల పెంపకంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, కళాశాలల్లో సైతం నిరంతరం అవగాహన కార్యక్రమాల ద్వారా వీరిలో ఆత్మస్థైర్యం పెరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా మహిళల భద్రతపై అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ప్రిన్సిపాల్ జి.గోవిందనాయుడు పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

మెరైన్ సీఐగా ప్రసాదరావు



బాధ్యతలు స్వీకరిస్తున్న సీఐ ప్రసాదరావు

గార: కళింగపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐగా బి.ప్రసాదరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. నరసన్నపేట సీఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ తీర ప్రాంతంలో గస్తీ ముమ్మురం చేయాలన్నారు. బీచ్‌లో ప్రమాదకర స్థలాల వద్ద స్నానాలకు దిగకుండా చూడాలన్నారు. మత్స్యకారులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తుండాలని, అపరచితులపై నిఘా ఉంచాలన్నారు.

రక్తదాతలు ప్రాణదాతలతో సమానం



రక్తదానం చేస్తున్న యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ ఎంవి తిలక్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ కార్యాలయంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 100 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ రాష్ట్ర వైస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ రిజర్వ్ హెడ్ పి.రవి, సుబ్ నారాయణ, అవార్డు ఉద్యోగుల సంఘం నాయకులు బి.శ్రీనివాసులు, ఆఫీసర్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు



విజయలక్ష్మీగా విజయదుర్గ



చిన్నబజారు వద్ద లలితా సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రావణ మాసంలోని మూడో శుక్రవారం సందర్భంగా శ్రావణలక్ష్మీకి పూజలు ఘనంగా జరిగాయి. పలువురు మహిళలు తమ ఇళ్లల్లో అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఆలయాలకు వెళ్లి సామూహిక కుంకుమార్చనలు, అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

ఎచ్చెర్ల: ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఎంఈవో ఎల్.ఈశ్వరరావు అన్నారు. లావేరు మండలంలోని లక్ష్మీపురం, తామాడ మండల పరిషత్ పాఠశాలలను శుక్రవారం సందర్శించారు. తెలుగు, ఆంగ్లం చదవడం వంటి విషయాలను గమనించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులు డి.ఈశ్వరరావు, పి వసంతలక్ష్మి ఉన్నారు.

వ్యక్తికి జైలు శిక్ష

శ్రీకాకుళం క్రైమ్ : భార్యను మానసికంగా, శారీరకంగానే కాక అదనపు కట్నం కోసం వేధిస్తున్న ముద్దాయి, నగరానికి చెందిన నల్లబరికి శ్రీనివాసరావుకు సంవత్సరం జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ శ్రీకాకుళం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ శుక్రవారం తీర్పిచ్చారు.

శివారు భూములకు సాగునీటిపై దృష్టి



ప్రాజెక్టు ప్రారంభంలో నీటి ప్రవాహ పరిస్థితి పరిశీలిస్తున్న ఏఈఈ జీవీ రమణ



ప్రారంభంలో కాలువ నుంచి వృథాగా పోతున్న నీరు

ఎచ్చెర్ల క్యాంపస్: నారాయణపురం కుడికాలువ పరిధిలో శివారు భూములకు సాగునీరు అందించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. కింతలి సెక్షన్ ఏఈ జి.వి.రమణ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం కాలువను పరిశీలించారు. ఆయకట్టు ప్రారంభం నుంచి శివారు వరకు కాలువ తీరుపై ఆరా తీశారు. ప్రారంభంలో నీరు వృథాగా పోతుండడంతో కొందరు రైతులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రారంభంలో నీరు వృథా కావటం వల్ల ప్రధానంగా ఎచ్చెర్ల మండలంలో 7,175 ఎకరాలకు సాగునీరు అందటం లేదని తెలిపారు. అధికారులు శివారు భూములకు సాగునీరు వెళ్లేందుకు నిరంతరం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అయితే ప్రధానంగా ఆయకట్టు ప్రారంభంలో ఇసుక మేటలు ఉండటం, కాలువలో నీటి ప్రవాహం అనుకున్న స్థాయిలో లేక పోవటం, ప్రారంభంలో సాగునీరు వృథాగా పోవటం వంటివి సమస్యగా మారాయి. సంతకవిటి, పొందూరు వరకు సాగునీరు చేరింది. ప్రారంభంలో వృథా అరికడితే ఎచ్చెర్లలో శివారు ఆయకట్టు కూడా పుష్కలంగా సాగునీరు వచ్చే అవకాశం ఉంది. రైతులు సైతం తమవంతు అడ్డులు, జంగిల్ తొలగింపునకు స్వచ్ఛందంగా కృషిచేస్తున్నారు.

సానివాడను దత్తత తీసుకుంటాం

- గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం రూరల్: సానివాడ గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటానని, ఇక నుంచి ఈ గ్రామాన్ని ఎమ్మెల్యేతో పాటు తాను కూడా దత్తత తీసుకుంటానని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధకశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మండల పరిధిలోని సానివాడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు, అవసరాలు తీర్చేదిశగా గ్రామసభలు నిర్వహించాలన్నారు. జిల్లాలో 912 గ్రామ సభలు నిర్వహించగా రాష్ట్రంలో 3,326 గ్రామసభలు జరుగుతున్నట్లు చెప్పారు. గ్రామాల్లో వీధిలైట్లు, సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సమస్యలు, మరుగుదొడ్లు, చెత్త, చెదారం నిర్వహణ వంటి సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు. సర్పంచ్‌లకు గత ప్రభుత్వం అధికారాలు ఇవ్వలేదని, ఆర్థిక సంఘ నిధులు దారి మళ్లించిందని విమర్శించారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో పంచాయతీల అభివృద్ధి కోసం రూ.2వేల కోట్ల పైచిలుకు డబ్బులు మంజూరు చేసిందన్నారు. ఇంటింటికీ బయోగ్యాస్‌ను పైపులైన్ వేస్తామని, చెరువులు, కాలువలు, వంశధార రిజర్వాయర్ సైతం బాగుచేస్తామన్నారు.

శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గ్రామసభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ఈ గ్రామసభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, జిల్లా పరిషత్ సీఈఓ వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ చిట్టిరాజు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, జెడ్పిటీసీ రుప్పదివ్య, గ్రామ సర్పంచ్ రుప్పలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కలిసికట్టుగా పని చేయాలి

రణస్థలం: గ్రామసభల్లో గ్రామాభివృద్ధికి సంబంధించిన పనులను పార్టీల కతీతంగా కలిసికట్టుగా తీర్మాణం చేసుకోవాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని 34 పంచాయతీల్లో మన పంచాయతీ.. మనసాధికారత గ్రామసభలను శుక్రవారం నిర్వహించారు. వెల్బురాయి గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీ రోడ్లు, కాలువలు, చెక్ డ్యామ్‌లు, ఇతర పనులు గుర్తించి అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

26 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలానికి సంబంధించి శ్రీకాకుళం నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న కుశాలపురం, తోటపాలెం పంచాయతీలు మినహాయించి 26 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలను అధికారులు నిర్వహించారు. ఉపాధి హామీ పనుల గుర్తింపుపై చర్చించారు. మండల స్థాయి అధికారులు పర్యవేక్షించారు.

గ్రామసభలతో పల్లెల అభివృద్ధి

గార: పల్లెల అభివృద్ధికి గ్రామసభలు దోహదపడతాయని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. శుక్రవారం సర్పంచ్ గొండు జయరాం ఆధ్వర్యంలో అంపోలు పంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ నుంచి మార్చి 2025 వరకు ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో పనులు నిర్వహిస్తామన్నారు.

పోరాటాల దిక్సూచి ఆంధ్రకేసరి



శ్రీకాకుళం అర్బన్: గాంధీ మందిరంలో టంగుటూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు



ఎచ్చెర్ల: మురపాకలో ప్రకాశం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి రాంబాబు తదితరులు

పోరాటాల దిక్సూచిగా ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు నిలుస్తారని వక్తలు పేర్కొన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతిని శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధుల స్మృతి వనం, లైబ్రరీలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
– సాక్షి నెట్‌వర్క్